


వెంకటాయపల్లి రోడ్డుపై నుంచి పారుతున్న వాగు (ఫైల్)




తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన వంతెన

# తీరిన ప్రయాణ కష్టాలు

- వెంకటాయపల్లి వాగుపై వంతెన నిర్మించిన తెలంగాణ ప్రభుత్వం
- తగ్గిన దూర భారం
- ఆనందంలో 8 గ్రామాల ప్రజలు

గంగాధర, అక్టోబర్ 31: గంగాధర మండలం వెంకటాయపల్లి గ్రామం మీదుగా మండలంలోని పలు గ్రామాల ప్రజల రాకపోకలు సాగిస్తుంటారు. వానకాలంలో భారీ వర్షాలు కురిసి వాగు ఉప్పొంగితే వరద నీరు రోడ్డుపై నుంచి ప్రవహించేది. దీంతో మండలంలోని దాదాపు 8 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. తమ గ్రామాలకు చేరుకోవాలంటే మండల కేంద్రం మీదుగా దాదాపు 15 కిలో మీటర్లు చుట్టూ తిరిగి గ్రామానికి చేరుకోవాల్సి వచ్చేది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారారు, కానీ వెంకటాయపల్లి వాగుపై వంతెన నిర్మాణం చేపట్టి ప్రయాణ కష్టాలు తీర్చాలన్న గ్రామస్తుల కోరికను తీర్చిన నాయకుడు కనిపించలేదు. దీంతో చేసేదేమీ లేక వానకాలంలో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడేవారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఈ క్రమంలో 2017లో వెంకటాయపల్లి వాగుపై వంతెన నిర్మాణానికి రూ. 1.35 కోట్లు మంజూరు చేసింది. వెంకటాయపల్లి వాగుపై వంతెన నిర్మాణ పనులు అధికారులు త్వరగా పూర్తి చేశారు. దీంతో ఏళ్లకు ఏళ్లుగా ఇబ్బందులు పడిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణంతో దూరభారం తగ్గిందని, వాగు ఎంతగా ఉప్పొంగి ప్రవహించినా ఇబ్బందులు లేకుండా ప్రయాణం సాగిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు.

### ప్రయాణ కష్టాలు తీరాయి



వానకాలంలో వాగు ఉప్పొంగి రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహించేది. దీంతో వెంకటాయపల్లితో పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం 2017లో వాగుపై వంతెన నిర్మాణానికి రూ. 1.35 కోట్లు మంజూరు చేయడంతో మా కష్టాలు తీరాయి. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాం. **-శ్రీమల్ల మేఘరాజు, సర్పంచ్, వెంకటాయపల్లి**

### దూరభారం తగ్గింది



వెంకటాయపల్లి వాగుపై తెలంగాణ ప్రభుత్వం వంతెనను నిర్మించడంతో వివిధ గ్రామాలకు వెళ్లే వారికి దూర భారం తగ్గింది. వానకాలంలో రోడ్డుపై నుంచి వరద ప్రవహించడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు పడ్డాం. పనుల కోసం మండల కేంద్రానికి, ఇతర గ్రామాలకు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఏ కష్టం లేకుండా వంతెనపై నుంచి వెళ్తున్నాం. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేసీఆర్ సారుకు రుణపడి ఉంటాం. **-వేముల శ్రీధర్, వెంకటాయపల్లి**




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

సమావేశానికి హాజరైన అధికారులు, ఉద్యోగులు



# వందశాతం పన్నులు వసూలు చేయాలి

కార్పొరేషన్, అక్టోబర్ 31: నగరపాలక సంస్థ పరిధిలో రెవెన్యూ ప్రకటనల పన్నులను వందశాతం వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. నగరంలోని బల్దియా సమావేశ మందిరంలో మంగళవారం ఆయన అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను విషయంలో ప్రత్యేకంగా దృష్టిసారించి పూర్తిస్థాయిలో వసూలు చేయాలని సూచించారు. మార్చిలోగా వంద శాతం పన్నులు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పూర్తి చేసేందుకు తగి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. నగరపాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం

తెలంగాణచౌక్, అక్టోబర్ 31: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య ఆరోపించారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో మంగళవారం నిర్వహించిన ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టేకుమల్ల సమ్మయ్య మాట్లాడుతూ, కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్నదని మండిపడ్డారు. 12 గంటల పని విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, గౌరవాధ్యక్షుడు లక్ష్మయ్య, సీపీఐ నగర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, నాయకులు బీరయ్య, మల్లికార్జున్, అంజయ్య, రాములు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య

## రాష్ట్రస్థాయి జూడో పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చొప్పదండి (రామడుగు), అక్టోబర్ 31: కరీంనగర్‌లోని మానేర్ పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ జూడో పోటీల్లో రామడుగు మండలం దేశరాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మ, పీఈటీ వెంకటరమణ తెలిపారు. 23 కేజీల విభాగంలో ఆకులు సాత్విక, 27 కేజీల విభాగంలో అమరగొండ స్వాతి, 36 కేజీల విభాగంలో కాస శివాని, 40 కేజీల విభాగంలో కావ్య, 44 కేజీల విభాగంలో కట్ట సంధ్య, 30 కేజీల విభాగంలో వేణుకుమార్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను సర్పంచ్ కోల రమేశ్, ఎంపీటీసీ వంచ మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ రత్నాకర్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

## నేడు ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

గంగాధర, అక్టోబర్ 31: మండలంలో బుధవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు తాడిజెర్రి, 9 గంటలకు రంగరావుపల్లి, 10 గంటలకు గోపాల్‌రావుపల్లి, 11 గంటలకు మల్లాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## విద్యార్థికి అభినందన



వివేక్‌ను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ నరేందర్ రెడ్డి

చొప్పదండి(రామడుగు), అక్టోబర్ 31: మండలంలోని గోపాలరావుపేట అల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థి వేముజల వివేక్ రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. కాగా, వివేక్‌ను మంగళవారం కళాశాల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



శ్రీనివాస్‌ను ఓదార్చుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 31 : గంగాధర మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సామంతుల శ్రీనివాస్ మాతృమూర్తి సత్తవ్వ మంగళవారం మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇక్కడ సర్పంచ్ మడ్లపెల్లి గంగాధర్ తదితరులున్నారు.

## జైపాల్‌రెడ్డిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు




జైపాల్‌రెడ్డితో గంగాధర మండల నాయకులు

గంగాధర, అక్టోబర్ 31: మైత్రీ గ్రూప్స్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కొత్త జైపాల్‌రెడ్డి మంగళవారం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, మండల బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా జైపాల్‌రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, దోర్నాల హన్మంత రెడ్డి, వీడీసీ చైర్మన్లు రేండ్ల శ్రీనివాస్, రామిడి సురేందర్, అలువాల తిరుపతి, నాయకులు దానె ఓదెలు, బొజ్జ మహిపాల్ తదితరులున్నారు.

## బీఆర్ఎస్ హయాంలో అన్ని వర్గాలకు న్యాయం

సైదాపూర్, అక్టోబర్ 31: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం జరుగుతున్నదని ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు పోలు ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందరికీ న్యాయం చేసిందన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాంనగర్, అక్టోబర్ 31: కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన మహాంకాళి లింగయ్య చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగయ్యా కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పులు కావడంతో సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. పక్కనే ఉన్న బంధువులు గమనించి దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. లింగయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.